ప్రజాశక్తి

సోమవారం 25 ఆగస్టు 2025

శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం పెరగాలి

మాజీఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెరగాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీ ఉంటాయన్నారు. సమాజంలో మంచి వ్యవస్థలన్నీ కుప్పకూలి పోతూ కొత్త మూఢనమ్మకాలు ముందుకు వస్తున్నాయన్నారు. పర్యావరణం పెద్ద సమస్యగా ముందుకొచ్చిందన్నారు. విద్యా వ్యవస్థలో సృజనాత్మకతకు స్థానం లేకపోగా ర్యాంకులకు ప్రాధాన్యం పెరిగిందనానరు. పిల్లలను పరిశోధనల వైపు ప్రోత్సహించడం సన్నగిల్లిందన్నారు .ఈ మార్పులను అవగాహన చేసుకుని జేవీవీ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకుని వాళ్లకు లాభాలు తెచ్చిపెట్టే వనరుగా మారిపోయాయన్నారు. దీన్ని ప్రజల్లో చర్చకు పెట్టాల్సిన బాధ్యత జెవివి కార్యకర్తలుగా మనమీద వుందన్నారు. దేశ పురోగతికి, మనిషి జీవన సౌలభ్యానికి శాస్త్ర సాంకేతిక రంగాలు అత్యంత కీలకమనిగ్రహించిన మన మొదటితరం పాలకులు శాస్త్రజ్ఞానాన్ని విస్తరింపజేయాలని, పౌరుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఆశించారనన్నారు. అందుకే మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ (హెచ్)లో ఆ విషయాన్ని పొందుపరిచారని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పరంగా మనకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఆర్థిక పెరుగుదల ఊహించని స్థాయికి వెళ్ళిందని లెక్కలు చెబుతున్నాయని సంపదలు పేరుకుపోతున్నాయని అన్నారు. దేశీయ ధనికులు ప్రపంచ ధనికుల సరసన చేరారన్నారు. అయినా సరే హ్యూమన్ డెవలప్మెంట్ ఇండెక్స్‌లో మనం అట్టడుగున ఉన్నామన్నారు. అందుకు కారణం శాస్త్ర విజ్ఞానం ఫలాలు సామాన్యులకు అందకపోవడమేనని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాలు పూర్తిగా వ్యాపారమయమై కార్పొరేట్ల కబంధ హస్తాల్లో బందీ అయిపోవడం వల్ల సమాజంలోని ఎక్కువ మందికి ప్రతికూల పరిస్థితులను కల్పిస్తున్నాయన్నారు. దాన్ని అర్థం చేసుకునీ సైన్స్ ఉద్యమములో పనిచేసే వాళ్ళమైన మనమీదనే దీన్ని చర్చకు పెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం అనేక పెడధోరణులు, అశాస్త్రీయ పోకడలు చోటుచేసుకున్నాయన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకుంటామని ప్రమాణం చేసిన వాళ్ళే దానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. విద్య, వైద్యంతో పాటూ అన్ని రంగాల్లోకి అశాస్త్రీయ భావాలను చొప్పిస్తూ అభివృద్ధి చెందిన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ చాందస వాదానికి బలం చేకూరుస్తున్నారన్నారు. రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్స్‌ను హేళన చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా చీకటి సామ్రాజ్యాలను నిర్మించుకున్న బాబాలు, స్వామీజీలకు ప్రభుత్వాల నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా నిలవడమే కాకుండా ఒక బాబా జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేస్థాయికి ఈ రోజు ప్రభుత్వాలు దిగజారడం బాధాకరమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను వ్యతిరేకించాల్సిన అవసరం వుందన్నారు. సైన్స్ ను అపహాస్యం చేస్తూ తరగతి గదిలోకి మూఢనమ్మకాలను, అశాస్త్రీయ భావజాలాన్ని చూపిస్తున్నారన్నారు. దీన్నీ అడ్డుకోవడం ఈ దేశ అభివృద్ధికి అత్యంత అవసరమని.లేదంటే భవిష్యత్ లో ఆఫ్గనిస్తాన్‌లో మాదిరి తే మహిళలు విశ్వవిద్యాలయ స్థాయి విద్యను చదవకూడదని చట్టం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రజాస్వామిక విలువలు అడుగంటుతున్నాయన్నారు. డాక్టర్ ఇ టి రామ్మూర్తి మాట్లాడుతూ ప్రశ్నించే తత్వాన్ని కాదు మాట్లాడే స్వాతంత్ర్యాన్ని కూడా హరించే పరిస్థితి ఈ రోజు దేశంలో వుందన్నారు. ఇదంతా కూడా పాలకుల ప్రోద్బలంతోనే జరుగుతోందన్నారు. డాక్టర్ టిఎం బషీర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు మానవుని జీవితాన్ని మరింత సుఖవంతంగా చేసిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు సామాన్య ప్రజలకు చేరువ చెయ్యాల్సిన బాధ్యత జెవివి కార్యకర్తలుగా మనమీద వుందన్నారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు జిల్లాలో రెండు సంవత్సరాల కాలంలో చేసిన కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా కోశాధికారి డి. చంద్రశేఖర్ రెడ్డి కోశాధికారి నివేదికను ప్రవేశపెట్టారు. యు టి ఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి , ఏ పి టి ఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రారెడ్డి పాల్గొని సౌహార్ద సందేశం ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు మహేంద్ర రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి, చైతన్య గంగిరెడ్డి, గౌస్‌లాజం, సురేష్, నిర్ధారణుడు , సంజీవప్ప, లక్ష్మీనారాయణ , షర్ఫుద్దీన్, మహేష్. లోకేష్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా 21 మంది అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజూరైన రూ.11.08.007 విలువైన చెక్కులను ఆదివారం బాలయ్య నివాసం వద్ద పీఏలు వీరయ్య, బాలాజీ టిడిపి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి కన్వీనర్ రాము, లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మారుతీ ప్రసాద్, ఎంపిటిసి గంగాధర్, మాజీ సర్పంచులు జయకృష్ణారెడ్డి, శ్రీరామ రెడ్డి, నాగరాజు, సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఆయకట్టు సర్పంచ్ హరిజయ రామ్, కోడిపల్లి కన్వీనర్ సతీష్, వేణు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల మెడపై ఎఫ్ఆర్ఎస్ కత్తి

పని చేయని సెల్ ఫోన్‌తో యాప్‌ల నిర్వహణ వ్యతిరేకిస్తున్న అంగన్వాడీలు

చాలీచాలని వేతనాలు ఇస్తూ...వారితో వెట్టిచాకిరీ చేయించడమే కాకుండా...వారి మెడపై ఎఫ్ఆర్ఎస్(ఫేసియల్ రికగ్నేషన్ సిస్టం) కత్తి పెట్టడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని చేయని సెల్ ఫోన్లను ఇచ్చి ప్రభుత్వ యాప్‌లు అన్నీ అందులో ఇన్‌స్టాల్ చేసుకుని, ఎప్పటికప్పుడు అందులో ఆన్‌లైన్ చేయమంటే నెట్‌వర్క్ లేని ప్రాంతాలతో పాటు కనీసం 2జీ స్పీడ్ లేని ఫోన్‌లతో ఎలా చేస్తారన్న ఆలోచన సైతం ప్రభుత్వానికి లేదు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు ఆందోళనకు సిద్ధం అయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశం 2జీ నెట్ వర్క్ నుంచి 5జీ స్థాయికి పరుగులు పెడుతోంది. అయితే అంగన్వాడీలకు ఇప్పటికి 2జీ సెల్ ఫోన్లను ఇచ్చారు. ఈ సెల్ ఫోన్‌లు అంగన్వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ సరిగా పనిచేయక పోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తవడం లేదు. దీంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5126 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల పరిధిలో 30 మండలాల్లో 2301, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 33 మండలాల్లో మెయిన్ సెంటర్‌లు 2198, మినీ సెంటర్‌లు 627 మొత్తం 2825 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మెయిన్ సెంటర్లు 264, మిని సెంటర్లు 36 మొత్తం 330 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఇచ్చే బాల సంజీవని నుంచి కిశోర బాలికలకు, గర్భిణులు, బాలింతలకు వరకు పోషక ఆహారాన్ని అందిస్తున్నారు. వీటన్నింటిని యాప్ ద్వారానే అందించాలని ప్రభుత్వం నిబంధనలను తీసుకొచ్చింది.

సుమారు ఆరు నెలల క్రితం ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారమే గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోమ్ రేషన్ సేవలు పొందాలని షరతు పెట్టారు. అందుకోసం అంగన్వాడీలు మొబైల్ ఫోన్ ద్వారా మంత్రిత్వ శాఖ పోషణ్ యాప్‌లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. ఎఫ్ఆర్ఎస్‌లో రిజిష్టర్ కాని వారికి టేక్ హోం రేషన్ ఇవ్వబోరని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులను తొలగించాలని ఆదేశాలను జారీ చేసింది. ఐసిడిఎస్ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని రద్దు చేయాలని సిడిపిఒలు అంగన్వాడీ టీచర్లపై ఒత్తిడి చేస్తున్నారు. లేకుంటే ఉద్యోగం తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని తొలగిస్తే అంగన్వాడీ వర్కర్లపై లబ్ధిదారులు గొడవకు దిగే అవకాశాలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఇటువంటి గొడవలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎఫ్ఆర్ఎస్ అయినా పూర్తి చేయాలని, లేకుంటే లబ్ధిదారులనైనా తొలగించాలని అంగన్వాడీలపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక అంగన్వాడీ వర్కర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పని చేయని సెల్ ఫోన్ లను సిడిపిఓలకు అందించారు. ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ ఎఫ్ఆర్ఎస్‌లో అంగన్వాడీ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌ను రెండు దశల్లో చేపట్టాలి. తొలుత మొబైల్‌లో లబ్ధిదారుల ఫొటో తీయాలి. రెండోది లబ్ధిదారుని ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఒటిపిని వెరిఫై చేయాలి. దీనిలో విఫలమైతే లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తారు. ఇటువంటి వారికి ఈ నెల ఒకటో తేదీ నుంచి టేక్ హోమ్ రేషన్ ఇవ్వవద్దని అంగన్వాడీ వర్కర్లకు ఆదేశాలు అందాయి. దీంతో గ్రామాల్లో చాలామంది ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని లబ్ధిదారులు అంగన్వాడీ వర్కర్లతో గొడవలకు దిగుతున్నారు.



పని చేయని సెల్‌ఫోన్లను చూపిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు (ఫైల్ ఫొటో)

ఆహార భద్రత చట్టానికి తూట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలతో పాటు చిన్నారులకు అందించే పోషక ఆహారాలను యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్‌తోనే ఇవ్వాలని నిబంధనలను తీసుకు రావడం అంటే కచ్చితంగా ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించడమే. గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలకు అవసరమైన పోషకాహారాన్ని అందజేయాల్సిన అవసరాన్ని ఈ చట్టం తెలియజేస్తుంది. 2025-26 బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన మొత్తాన్ని న్యూట్రిషన్ కోసం ఖర్చు చేస్తుంది. కానీ నిధులను నిలిపివేస్తామని కేంద్రం బెదిరించడం వల్ల పీడీ, సిడిపిఒలు అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అంగన్వాడీ ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు తెలిసింది.

5జీ సెల్ ఫోన్, ట్యాబ్‌లు అందించాలి

అంగన్వాడీలను అధికారులు, ప్రభుత్వం బెదిరింపులను పాల్పడితే అంగన్వాడీల సత్తా ఏమిటో మరో సారి చూపించాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో నెట్ వర్క్ సరిగా ఉండదు. దీనికి తోడు గతంలో ఎప్పుడో ఇచ్చిన సెల్ ఫోన్‌లలో 2జీ నెట్ వర్క్ వస్తోంది. దీంతో యాప్‌ల నిర్వహణతో పాటు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలంటే సాధ్యం కాదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే 5జి నెట్‌వర్క్ తో కూడిన సెల్ ఫోన్ లేదా ట్యాబ్ లను అందించడంతో పాటు గ్రామస్థాయిలో నెట్‌వర్క్‌ను పెంచాలి. ఇలా చేయకుండా బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేయాల్సి ఉంటుంది.



ఈఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకే

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తున్నాము. ఐసిడిఎస్‌లో అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్ఆర్ఎస్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. లబ్ధిదారులను తొలగించాలని ఎక్కడా చెప్పలేదు. లబ్ధిదారుల ఫొటోతో పాటు ఆధార్ కార్డు ఒటిపి సక్రమంగా అందిస్తే సరిపోతుంది.

వరలక్ష్మి
ఐసిడిఎస్ సిడిపిఒ

సమస్యలకు పరిష్కారం చూపేరా .?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటికి ఏ మేరకు పరిష్కారాలను సోమవారం జరగబోయే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో చూపనున్నారన్నది చూడాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభమైన జూన్, జులై నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పంటల సాగు కూడా 60 శాతం వరకే జిల్లాలో అయింది. ప్రధాన పంట వేరుశనగ అత్యల్పంగా సాగైంది.ఆగస్టులో మంచి వర్షాలొచ్చాయి. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగలేదు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచి ప్రత్యామ్నాయ పంటల సాగైనా పెరిగే అవకాశముంది. సాగు విస్తీర్ణం పెద్దగా పెరగపోయినా యురియా కొరత మాత్రం తీవ్రంగా ఉంది. రైతులకు యూరియా అందుబాటులో ఉండటం లేదు. అంచనాకు మించే జిల్లాకు యూరియా వచ్చినప్పటికీ రైతులకు మాత్రం దొరకడం లేదు.పక్కదోవ పట్టినట్టు ఆరోపణలున్నాయి. యూరియా కొరతపై ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరగనుందన్నది చూడాల్సి ఉంది. ఇక ఇప్పటి వరకు కూడా ఐఎబి సమావేశం జరగలేదు. అందులో అధికారులే కేటాయింపులు జరిపి నీటి విడుదలపై నిర్ణయం చేశారు. అయితే ఈ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో రైతుల వరకు తెలియకపోవడంతో మిడ్‌పెన్నార్ దక్షిణ, ఉత్తర కాలువ కిందనున్న ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. హంద్రీనీవాది అదే పరిస్థితి ఉంది. హంద్రీనీవా కింద ఆయకట్టుకు ఏ రకంగా నీరు ఇస్తారన్న దానిపైనా ఇప్పటికీ స్పష్టత లేదు. ఇక హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరిగినప్పటికీ భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం పనులు భూసేకరణ వద్దనే ఆగిపోయాయి. ఈ పనుల పురోగతిపై ఈసమావేశంలో ఏ రకమైన చర్చ నడవనుందన్నది చూడాల్సి ఉంది. ఇటీవల వికలాంగుల పింఛను రద్దుపైనా పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 21 శాతం పింఛన్లు రద్దయ్యాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వీటికి పరిష్కారం ఏమి చూపనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రహదారులు, గృహ నిర్మాణా సమస్యలు అనేకం ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. ఈ సమీక్షలో వాటిన్నింటికి ఏరకమైన పరిష్కారా మార్గాలను చూపనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం

నేడు డిఆర్‌సి

జిల్లా అభివృద్ధి కమిటీ (డిఆర్‌సి) సమావేశం నేడు జరుగనుంది. జిల్లా ఇంఛార్జీ మంత్రి టిజి.భరత్ అధ్యక్షతన జరుగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవనంలో ఈ సమావేశం జరుగనుంది. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు. గతేడాది నవంబరు తొలి డిఆర్‌సి జరిగింది. అప్పటి నుంచి ఇప్పుడు తొమ్మిది మాసాల తరువాత రెండో డిఆర్‌సి జరుగనుంది.

పూర్వ విద్యార్థుల కలయిక

32 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారు తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకోవడంతో పాటు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 32 సంవత్సరాల అనంతరం మొట్టమొదటిసారిగా పూర్వ విద్యార్థులందరూ కలుసుకోవడంతో వారు చదువుకున్న స్కూల్ లో గదులను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. 32 ఏళ్ల తర్వాత మొదటి సారి కలుసుకున్న కొంతమంది చిన్ననాటి స్నేహితులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ విద్యార్థులకు విద్యను బోధించిన ఉపాధ్యాయులతో గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం అనంతరం సహపంక్తి బోజనాలు చేసి ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.



గెట్ టుగెదర్ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

ఆసుపత్రిలో తెలుగు తమ్ముళ్ల అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఆదివారం తెలుగు తమ్ముళ్లు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సేవా స్ఫూర్తితో ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి ఎం.డీ. ఎస్. అమన్, 7వ వార్డ్ మహబూబ్ బాషా, బండ్లపల్లి హసీబ్, అక్బర్, ఐటిడిపి సాదిక్, యాసిన్, షామీర్, రెహ్మాన్, సుహేబ్, ఉజేఫా తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి. మధుసూదన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తద్వారా ఆదా పొందాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడతామని హామీ ఇచ్చింది. అందులో స్త్రీ శక్తి పథకం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకం అమలుతో మహిళలు ఎంతో సంబరపడిపోతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, చిరు వ్యాపారాలు చేసే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగంగా ఉందని జిల్లా వ్యాప్తంగా మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక జిల్లాకే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలు ఏదేని గుర్తింపు కార్డు చూపించి ప్రయాణించవచ్చు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల వివరాలు ఎన్ని బస్సులు ఈ పథకానికి అందుబాటులో ఉన్నాయన్న విషయాలపై శ్రీ సత్య సాయి జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.



ప్రశ్న:- జిల్లాలో ఎన్ని బస్సులు ఉన్నాయి? స్త్రీ శక్తి పథకానికి ఎన్ని బస్సులు వినియోగిస్తున్నారు? మహిళా ప్రయాణికుల వివరాలు తెలపండి?

జవాబు: జిల్లాలో మొత్తం 360 బస్సులు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర బస్సుల డిపోల ద్వారా 315 బస్సులు స్త్రీ శక్తి పథకానికి వినియోగిస్తున్నారు. ఈనెల 15న ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈనెల 22వ తేదీ వరకు ఎనిమిది రోజుల్లో 5,08,910 మంది మహిళలు ప్రయాణించి రూ.1,85,41,814ల ఆదాయం పొందారు.

ప్ర: మహిళలు ఏయే బస్సులలో ప్రయాణించవచ్చు ? కొన్నిచోట్ల బస్సులు నిలపడం లేదనే ఆరోపణలున్నాయి ?

జ : అంతర్ రాష్ట్రాలకు వెళ్లే బస్సులు, సూపర్ లగ్జరీ, నాన్ స్టాప్ బస్సులు మినహాయించి ఇతర ఏ బస్సులో అయినా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. బస్సులు నిలపడం లేదనే సమస్య ఉండదు. అప్పటికే బస్సులలో రద్దీగా ప్రయాణికులు ఉంటే నిలబెట్టకుండా వెళ్లి ఉండవచ్చు. ఎక్కడ స్టాపింగ్ ప్రదేశం ఉంటే అక్కడ తప్పనిసరిగా బస్సు నిలపాల్సిందే. ఇదే విషయం పై డ్రైవర్, కండక్టర్లకు తగిన సూచనలు ఇచ్చాము. ఒకవేళ ఎక్కడైనా అలాంటి సంఘటనలు ఎదురైతే ఆయా డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు. అంతేగాక ఎక్కడైనా ప్రయాణికులు ఎక్కువగా ఉంటే అక్కడికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తాం.

ప్ర : జిల్లాలో ఏయే ప్రాంతాలకు అంతర్ రాష్ట్రాలకు బస్సులు నడుపుతున్నారు?

జ : జిల్లాలోని ఆరు డిపోల ద్వారా స్త్రీ శక్తి పథకానికి 315 బస్సులు ఫోను మిగతా 45 బస్సులు నగరాలకు నడుస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ, నెల్లూరు. తిరుపతి, విజయవాడ. ఒంగోలు, కడప, కర్నూలు. నంద్యాల, శ్రీశైలం తదితర ముఖ్యమైన పట్టణాలకు బస్సులు నడుపుతున్నాము. అంతర్ రాష్ట్రాలైన బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, అరుణాచలం తదితర అంతర్ రాష్ట్రాల ముఖ్య నగరాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాము.

ప్ర : ఆర్టీసీ లాభాల బాటలో నడపడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ముఖ్యంగా డీజిల్ ఆదాతో పాటు, కార్గో ద్వారా వస్తువులు, లగేజ్ పంపుతూ ఆదాయం మార్గాలను చేపడుతున్నాము. డీజిల్ ఆదా, అధిక కలెక్షన్ తెస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక శిక్షణతో పాటు ప్రతి ఏటా ఆదాలో ప్రతిభ చూపించిన సిబ్బందికి నగదు ప్రోత్సాహ బహుమతులు అందించడం జరుగుతోంది. సమయపాలన పాటించడం పై కూడా చర్యలు తీసుకుంటున్నాము.



ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్

ప్ర : మహిళా ప్రయాణికులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ : ఆర్టీసీ సంస్థ ప్రజలది, అందరిదీ అని ప్రయాణికులు గుర్తించాలి. క్షేమంగా గమ్యానికి చేరుకోవడానికి ఆర్టీసీ లోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి. ఆర్టీసీలో ప్రయాణం క్షేమంగా ఉంటుంది. ప్రయాణికులకు సౌకర్యంగా ఆయా డిపోలు, బస్టాండ్లలో ముందస్తుగా టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాము. ప్రతి బస్టాండ్ లోను ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు కల్పించడంతోపాటు పరిశుభ్రత పాటించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాము. పుణ్యక్షేత్రాలకు సైతం ప్రయాణికులు ముందుగా బుకింగ్ చేసుకుంటే ప్రత్యేక బస్సులు నడుపుతాము. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆదా పొందాలని కోరుతున్నాము.

కెజిబివిని తనిఖీ చేసిన ఎంపిపి, ఎంపిడిఒ

సమస్యలు మొర పెట్టుకున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ఎంపిడిఒ నసీమ, పంచాయతీ సెక్రటరీ మంజులతో కలిసి సందర్శించారు. వారు ముందుగా బోధన, బోధనేతర సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పౌష్టికాహారం సరిగా లేదని, రాగి పిండి లేకుండా తెల్లటి ముద్దలు వడ్డిస్తున్నారని, తరగతులు ప్రారంభమై మొదటి పీరియడ్ ముగిసినా అల్పాహారం అందించడం లేదని, మెనూ పాటించడం లేదని, చపాతి, పూరి, తదితర వంటకాలు చేసేటప్పుడు విద్యార్థినులతో పని చేయిస్తున్నారని, ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను టీచర్లు, సిబ్బంది ఇంటికి తీసుకెళ్తున్నారని, చాలీచాలని విధంగా భోజనం వడ్డిస్తున్నారని, వంట సిబ్బంది తరచూ గొడవపడుతున్నారని, దీంతో చదువుకోవడం చాలా కష్టంగా ఉందని బాలికలు వారికి మొరపెట్టుకున్నారు. స్పందించిన వారు ఈ విషయాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని విద్యార్థినులకు హామీ ఇచ్చారు.


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

యుటిఎఫ్ క్రికెట్ టోర్నీ.. ఫైనల్స్‌కు చేరిన ఎన్.పి.కుంట, రొద్దం జట్లు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం పెనుకొండ డివిజన్ యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం టోర్నీ కన్వీనర్ జి.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో హిందూ పురం, నంబులపూలకుంట జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్‌పి.కుంట జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 112 పరుగులు చేసింది. ఆ తర్వాత హిందూపురం జట్టు 101 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ముఖ్యఅతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాబు, సీనియర్ నాయకులు చెన్నకేశవులు చందూకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవమైన సెప్టెంబర్ 5వ తేదీ రొద్దం, ఎన్‌పి.కుంట ఉపాధ్యాయుల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. అదే రోజు విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు గంగాధర్, శివయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, విష్ణు, జగదీశ్, రామాంజనేయులు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



చందూకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న అతిథులు

ఓబుళాపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఆదివారం శ్రీ ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో బిజెపి మండల అధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నరసింహామూర్తి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి వారం ఓ రోజు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అందులో రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స, మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక భారం లేకుండా ఆరోగ్య సంరక్షణ కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందన్నారు. శిబిరంలో సిరివరం మూర్తి, శేఖర్, అవినాష్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హరీష్, చంద్రప్ప, పరమేష్, శ్రీ ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న నాయకులు, ఆసుపత్రి సిబ్బంది

పల్లెవాండ్లపల్లిలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి-నల్లచెరువు

వైసిపి కదిరి నియోజకవర్గ సమన్వయ కర్త బిఎస్ మక్బూల్ అహమ్మద్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ఓరువాయి పంచాయతీ పరిధిలోని పల్లెవాండ్లపల్లిలో మండల కన్వీనర్ మండెం రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, సిఎం చంద్రబాబు మోసాలపై వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ వైసిపి శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బండ్రేవు నరసింహారెడ్డి, పల్లె వెంకటరెడ్డి, ఆనంద్‌రెడ్డి, నాగభూషణ, నరసింహారెడ్డి, రమణారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, ఆదిమూర్తి, షేక్ మన్సూర్ బాషా, జెసిబి సూరి, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ ఖాదర్ వలి, మండల జనరల్ సెక్రటరీ లక్ష్మీపతి, చిన్నపల్లి హరి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, ఆదినారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, రామాంజనే యులు, ఎల్లప్ప, వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, వెంకటేష్‌నాయుడు, భాస్కర్ నాయుడు, గుత్తా వెంకటేష్‌నాయుడు, షేక్ మౌలాలి, శ్రీరాములు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

చిత్రావతి నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

చిత్రావతి నది నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం చిత్రావతి నది నుంచి యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలించడం కనిపించింది. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోనందున ప్రభుత్వ సెలవు దినాలే లక్ష్యంగా అక్రమార్కులు ఈ ఇసుక దందా నడిపిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కూతవేటు దూరంలో ఎస్పీ నివాసం, కలెక్టరేట్ ఉన్నా అక్రమార్కులు ప్రభుత్వ సెలవు రోజుల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ముఖ్యంగా చిత్రావతి న్యూ బైపాస్‌లోని సాయి నగర్ సమీపంలో, దుర్గమ్మ దేవాలయం సమీపంలో రోజూ జెసిబిలు పెట్టి ట్రాక్టర్లతో ఇసుకను తోడేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం లేదా ఇతర సెలవు రోజుల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక దోపిడీ జరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తీసుకుపోవాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇసుకను దోచేస్తున్నారన్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని ఇసుక అక్రమ రవాణాను అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం


సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది

సెల్ఫీ తెచ్చిన తంటా

లోయలోకి జారిపడ్డ తమిళనాడు వాసి

ఆస్పత్రికి చేర్చిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-పెనుకొండ

కొండపై ఓ వ్యక్తి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు లోయలో జారిపడి తీవ్ర గాయాల పాలైన సంఘటన పెనుకొండలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడులోని చెన్నైకి చెందిన విగ్నేష్ సోమందేపల్లి మండలం గుడిపల్లి సమీపంలో ఉన్న డోంగా హ్యాసుంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఐటి విభాగంలో పని చేస్తున్నాడు. ఆదివారం స్నేహితుడితో కలసి పెనుకొండ కొండపై ఉన్న పకతి అందాలను తిలకించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సెల్ఫీ తీసుకునేందుకు కొండ లోయ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడ్డాడు. అతనితో పాటు ఉన్న స్నేహితుడు అగ్నిమాపక ఎస్ఐ వెంకటేషులకు సమాచారం అందించారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన లొకేషన్‌ను వారికి పంపాడు. అగ్నిమాపక ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలపాలైన విగ్నేష్‌ను తాళ్ల సహాయంతో లోయలో నుంచి పైకి చేర్చారు. 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలు, చేయి విరిగి తీవ్ర రక్త స్రావం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని అనంతపురానికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్ఫీ పిచ్చితో ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారని కొండ చివరకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోయలో పడడంతో పైకి తీసుకు రావడానికి చాలా ఇబ్బంది పడ్డామన్నారు. స్ట్రక్చర్ లేకపోవడంతో బాధితున్ని తాళ్ల పైనే లోయ లో నుంచి బయటికి తీసుకొచ్చామన్నారు. కొండపైన ప్రకతి అందాలు తిలకించేందుకు వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

బాలయ్యకు అరుదైన గౌరవం

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో స్థానం

ప్రజాశక్తి-హిందూపురం

నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో ఆయన పేరు నమోదైంది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా బాలయ్య నిలిచారు. సినీ పరిశ్రమలో నటుడిగా 50 వసంతాలు పూర్తి చేసుకు న్నారాయన. సినిమా ఇండస్ట్రీకి ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఈ పురస్కారాన్ని అందించను న్నారు. ఈ నెల 30న బాలయ్యను ఈ పురస్కారంతో సత్కరించనున్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సిఇఓ సంతోష్ శుక్లా అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో..అయన నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలమత్తూరు : నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల సినీ సేవకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించడం తెలుగు ప్రజలకు గర్వకారణమని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌరాణికం, జానపదం, ఫ్యాక్షన్ వంటి విభిన్న పాత్రలతో అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా ప్రకటించడం తెలుగు ప్రజలకు గర్వకారణం అన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-అమడగూరు/బత్తలపల్లి

వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రైవేట్, పబ్లిక్ స్థలాలల్లో మండపాలు, ప్రతిమల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అమడగూరు మండల శిక్షణ ఎస్ఐ ప్రదీప్ రాజ్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. నిర్వాహకులు కమిటీని ఏర్పాటు చేసి వారి పేర్లు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. నిమజ్జనం తేదీ, ఊరేగింపు వివరాలు తెలపాలన్నారు. అలాగే పలు నిబంధనలు, సూచనలు చేశారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పల్లెలకు ఆర్టీసీ సేవలు నిల్..!

◆ ప్రైవేటు వాహనాలు, ఆటోలే దిక్కు..

◆ 'స్త్రీ శక్తి' లబ్ధి పొందలేని గ్రామీణ మహిళలు

ప్రజాశక్తి-గుడిబండ

మండల వ్యాప్తంగా పలు మారుమూల గ్రామాలకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు విధి లేని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేసే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఇటీవల మహిళలకు రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిన విషయం విదితమే. అయితే మండలంలో సుమారు 60 శాతం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇక్కడి మహిళలు స్త్రీ శక్తి పథకం ద్వారా లబ్ధి పొందలేని పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 63 గ్రామాలు ఉండగా శంకరగల్లు, రాళ్లపల్లి, కెంచయ్యపాలెం, ఎన్ఆర్.రొప్పం, మైనగానపల్లి, కల్లురొప్పం, మదిగుబ్బ, కేకాతి, రామయ్యనట్టి, కెడి.పాల్యం, జవనడుకు, దాసరపల్లి, గొల్లపల్లి, డి.గొల్లహట్టి, పి.గొల్లహట్టి, హెచ్ఆర్. హట్టి, తాలికెర, తిమ్మలాపురం, బాలదిమ్మనపల్లి, బాలేపల్లి, నాచేపల్లి, వీరజనపల్లి, హుస్సేన్‌పురం, ఇటికేపల్లి, ముత్తుకూరు, ఎంఎస్.తండా, కురుబరపల్లి, కెకె.పాల్యం, సింగేపల్లి, మందలపల్లి, కొంకల్లు, గుడ్డదహళ్లి, జిఎస్.తండా, ఎస్ఎస్.గుండ్లు, ఎస్.రాయపురం, మేకలగట్ట, పూజారిపల్లి, బైరేపల్లి, మోరుబాగల్, గునే మోరుబాగల్, దేవరహట్టి, ఎస్ఆర్.హట్టి, పిఎస్.పాల్యం, తదితర గ్రామాలకు ఏళ్ల తరబడి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మడకశిర, అమరాపురం, అగళి, రొళ్లతో పాటు హిందూపురం, అనంతపురం, పుట్టపర్తి, కదిరి, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఇటీవల స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మండలంలోని మహిళలు సంబరపడ్డారు. అయితే చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయని చెప్పవచ్చు. విధి లేని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఒకవేళ సాయంత్రం 6 గంటలు దాటితే ఆ ప్రైవేటు వాహనాలు, ఆటోలు కూడా అందుబాటులో ఉండవు. దీంతో రాత్రి వేళ ఏవైనా అత్యవసర, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే నానా అవస్థలు పడాల్సిన వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని మండలంలోని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.


బస్సు సౌకర్యం లేక ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు

డీఎస్సీలో సత్తా చాటిన పేదింటి బిడ్డలు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కూగిర్నపాలెం గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్, పద్మావతి దంపతుల కుమారుడు వడ్డే చంద్రశేఖర్ 'చదువుకు పేదరికం అడ్డుకాదు' అనే సామెతను నిరూపించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. డీఎస్సీలో జిల్లా స్థాయిలో 12వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్, టిజిటి పోస్టులకు ఎంపికయ్యారు. వారిది సామాన్య వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసా యంతో పాటు కూలి పనులు చేసి చంద్రశేఖర్‌ను చదివించారు. వారి కష్టాన్ని గుర్తించిన చంద్రశేఖర్ అంకితభావం, పట్టుదలతో చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.


వడ్డే చంద్రశేఖర్

అలాగే కెఎన్. పల్లి గ్రామానికి చెందిన వైకుంఠప్ప, నాగమ్మ దంపతుల కుమారుడు హరికృష్ణ డీఎస్సీ పరీక్షలో 19వ ర్యాంకు సాధించి ఫిజిక్స్ స్కూల్‌అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. వీరిది ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబమే. ఒడిదుడుకుల మధ్య కష్టపడి చదివిన హరికృష్ణ డీఎస్సీ-2018లో స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రులు, చెల్లి ప్రోత్సాహంతో మరింత కష్టపడి చదివి 8ఏళ్ల తర్వాత విజయం సాధించారు.


హరికృష్ణ

రైతు బిడ్డకు 5వ ర్యాంకు.. మూడు ఉద్యోగాలు

బత్తలపల్లి : బత్తలపల్లికి చెందిన బాలగొండ వీరనారప్ప డీఎస్సీ పరీక్షలో జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), టిజిటిలో 114వ ర్యాంకు, పిజిటిలో 94వ ర్యాంకు సాధించి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈయన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. వీరిది సాధారణ రైతు కూలీ కుటుంబం.



బి. వీరనారప్ప

జూనియర్ అసిస్టెంట్ నుంచి టీచర్‌గా

చిలమత్తూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పెడబల్లి గ్రామానికి చెందిన రైతు దంపతులు ఓబుల్‌రెడ్డి, రత్నమ్మల కుమార్తె శిరీష డీఎస్సీ పరీక్షలో 50వ ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపికైంది. దీంతో ఆమెను రెవెన్యూ సిబ్బంది అభినందించారు.


శిరీష

రొద్దం : మండలంలోని సానిపల్లి గ్రామానికి చెందిన కురుబ కెసి.ఆంజనేయులు ఎస్‌జిటి టీచర్‌గా ఎంపిక అయ్యారు. ఈయన 3 ఏళ్లుగా అనంతపురంలోని సాగర్, ప్రజ్ఞ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందారు. కంబాలపల్లి గ్రామానికి చెందిన చంద్రమౌళి 2వ ర్యాంక్‌తో ఎస్ఎ మ్యాథమెటిక్స్ ఉద్యోగం సాధించారు. ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన కె.మధుసూదన్ 15వ ర్యాంక్‌తో ఎస్ఎ సోషియల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. రొప్పాల గ్రామానికి చెందిన సోమశేఖర్ 70వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉద్యోగం సాధించారు. ఈ ఏడాది మండలంలోని పలు వురు యువతీ, యువ కులు పోలీసు, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు.


కె.మధుసూదన్


ఆంజనేయులు


చంద్రమౌళి

నేడు టిడిపి సమావేశం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాల యంలో ఈ నెల 25వ తేదీ నిర్వహించే హిందూ పురం పార్లమెంట్ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సూచనతో సోమవా రం ఉదయం 9 గంటలకు హిందూపురం పార్లమెంట్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి టిజి.భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరవుతారన్నారు. కావున నియోజకవర్గం లోని అన్ని మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయ కులు, సింగిల్‌విండో అధ్యక్షులు, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, మాజీలు హాజరుకావాలని పల్లె కోరారు.

కదిరిలో అరబిక్ హోటల్ సీజ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో ఇంతియాజ్ నిర్వహిస్తున్న అరబిక్ హోటల్‌ను ఆదివారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సీజ్ చేశారు. వివరాలు.. అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ అరబిక్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిని వదిలేసిన చికెన్, మటన్ ముక్కలను వడ్డిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా అపరిశుభ్రత నడుమ వంటలు తయారు చేయడం, వారాల తరబడి ఆహార పదార్థాలు నిల్వ ఉంచడం, గడువు తీరిన మసాలాలు వినియోగించినట్లు గుర్తించారు. కుళ్లిన చికెన్, మటన్ చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడు తున్నట్లు గుర్తించి హోటల్‌ను సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.


అరబిక్ హోటల్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. ఉమ్మడి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని సున్నపుబట్టి వీధికి చెందిన హాజీవలి(24) పట్టణంలోని అరబిక్ హోటల్‌లో సప్లయర్‌గా పని చేసేవాడు. అతడు మిత్రులతో కలిసి పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న అల్లా బకాష్‌కు చెందిన పై అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ కవర్‌ను పార వేసేందుకు గది నుంచి బయటికి వచ్చిన హాజీవలి చేయి ప్రమాదవశాత్తూ ఆ భవనం పక్కన వెళ్తున్న 11 కె.వి విద్యుత్ లైన్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై మెట్ల మీద పడిపోయాడు. గమనించిన సహచరులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యువకుని తండ్రి అన్వర్‌బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై కమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద ఆదివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గోరంట్ల మండలంలోని పుల్లగూర్లపల్లికి చెందిన ఆంజనేయులు (50) మృతి చెందాడు.. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంజనేయులు పని నిమిత్తం కమ్మయ్యగారిపల్లి వెళ్లి తిరిగి వెళ్తుండగా హైవే పక్కన ఉన్న పంజాబీ దాబా వద్ద రోడ్డు దాటే క్రమంలో అనంతపురం వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు తీవ్రంగా గాయపడడంతో స్థానికుల సాయంతో 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పరిగి

పరిగి చెరువులో హొన్నంపల్లి గ్రామ శివారులో ఆదివారం స్థానికులు గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చన్నారు. మెడలో నల్ల దారం, ఒంటిపై బిస్కెట్ కలర్ చీర, దానిపైన నల్లని బొట్లు కలిగి ఉండి, నలుపు రంగు జాకెట్ ధరించిందన్నారు. పరిగి చెరువులోని మట్టి గుంతలో పడి మృతిచెందిందన్నారు. ఆచూకీ తెలిస్తే పెనుగొండ సిఐ-94407 96841, పరిగి ఎస్ఐ-94409 01879లకు సమాచారం ఇవ్వాలన్నారు.

బైక్‌పై వెళ్తూ కుక్కలను ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆర్.మరవపల్లి పెట్రోల్ బంక్ వద్ద మూడు కుక్కలు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇదే గ్రామానికి చెందిన అంజి కింద పడ్డాడు. దీంతో అతడిని రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే 4 రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన మారుతిరెడ్డి కూడా మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో కుక్కలు అడ్డుగా రావడంతో బైక్‌పై నుంచి కిందపడడంతో 8 కుట్లు పడినట్లు ఆయన వాపోయాడు. ప్రతి సోమవారం ఈ మార్గంలో కర్నాటకలోని పావగడలో గొర్రెల సంతకు వెళ్లే వాహనాల్లో కుక్కలను తీసుకొచ్చి ఇక్కడ వదులుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.



ఆస్పత్రిలో ఇంజక్షన్ వేయించుకుంటున్న బాధితుడు

శ్మశానవాటికలో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని మామిళ్లకుంట క్రాస్‌లో దళితులు, బిసిలు నివాసం ఉన్న ప్రాంతంలో శ్మశానవాటికలో ఖాళీ స్థలం లేక, ముళ్లపొదలు విపరీతంగా పెరగడంతో ఎవరైనా మృతిచెందితే పూడ్చడానికి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ ప్రాంత వాసులు మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి పరిష్కారం చూపారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే వెంకటేష్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్, పంచాయతీ సెక్రటరీ నాగరాజు ఆదివారం శ్మశానవాటిక స్థలాన్ని సందర్శించి జెసిబి ఏర్పాటు చేసి ముళ్ల పొదలు తొలగించారు. దీంతో వ్యకాసం నాయకులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక స్థలం చాలదని, భవిష్యత్తు తరాలకు మరోచోట స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి, కాలనీవాసులు పాల్గొన్నారు.


ముళ్లపొదలు తొలగించిన శ్మశానవాటికను పరిశీలిస్తున్న వ్యకాసం నాయకులు


వికలాంగ వృద్ధురాలికి వీల్ చైర్ అందజేస్తున్న బాలయ్య అభిమానులు

ఎమ్మెల్యే బాలయ్య అభిమానుల దాతృత్వం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని పుట్టగూర్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే వికలాంగ వృద్ధురాలికి ఆదివారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులు వీల్ చైర్ అందజేసి దాతృత్వం చాటుకున్నారు. లక్ష్మమ్మకు రెండు కాళ్లు చచ్చుబడి ఓ చోట నుంచి మరో చోటుకు వెళ్లలేని దీనస్థితిలో ఉంది. ఆమె అవస్థలు చూసి చలించిన భగత్ సింగ్ సేవా సమితి అధ్యక్షుడు కార్తీక్ బాలయ్య వీరాభిమాని సీనియర్ జర్నలిస్ట్, మండల పాత్రికేయ సంఘం అధ్యక్షుడు గిరీష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాలకృష్ణ అభిమాన సంఘం ద్వారా రూ.5 వేల రూపాయల చేసే వీల్ ఛైర్‌ను సొంత నిధులతో అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం 8వ వార్డు కౌన్సిలర్ కె.గిరీష్‌కుమార్, సేవామందిర్ ఆంజనేయస్వామి ఆలయ పురోహితులు వాసుదేవరావు, మోదా ఆది, విప్రో వెంకటేష్, డీలర్ రామంజి, చంద్ర, జనసేన నాయకుడు రమేష్, మూలింటి అంజనప్ప, హనుమయ్య పాల్గొన్నారు.

వైసిపి నాయకుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-గాండ్లపెంట

వైసిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ ఫరూక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బూల్ అహ్మద్ ఆదివా రం ఆ గ్రామం వెళ్లి ఫరూక్ కుటుంబ సభ్యులు, ఇద్దరు కుమారులను పరామర్శిం చారు. మీ కుటుంబానికి పార్టీతో పాటు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గొడ్డువెలగల పంచాయతీలోని పల్లెవాండ్లపల్లికు వెళ్లారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పింఛ ను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన నాగార్జున కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్హుల పింఛన్లు కొనసాగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వా న్ని హెచ్చరించారు. ఆయన వెంట న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్, ఎస్.ఫయాజ్‌అలీ, ఎం.నర్సింహులు, శంకరనాయుడు, పామిడి మహమ్మద్ ఇక్బాల్, సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.


వైసిపి నాయకుని కుటుంబ సభ్యులతో మక్బూల్ అహ్మద్

కుట్టుశిక్షణతో మహిళలకు జీవనోపాధి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

కుట్టు శిక్షణ మహిళల ఆర్థిక జీవనానికి ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ చైర్మన్ డి.ఇ రమేష్ కుమార్ పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలో సడ్లపల్లి, ముదిరెడ్డి పల్లి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలు 90 రోజుల శిక్షణ పూర్తి చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయా కుట్టు శిక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ హిందూపురం మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా 5000 కుట్టు మిషన్ లను దాదాపుగా 10 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సడ్లపల్లి, ముదిరెడ్డిపల్లి లో ఉన్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు 90 రోజులు పూర్తి చేసుకున్నారని, త్వరలోనే వారికి కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికెట్లను ఎంఎల్ఏ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు సునీత రెడ్డి, మహాలక్ష్మి, భారతి, టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, టీడీపీ నాయకులు వెంకటేష్ రెడ్డి, నారాయణప్ప, లింగారెడ్డి, చలపతి, రామప్ప, వెంకటస్వామి, నాగేంద్ర, హరీష్ కుమార్, నారాయణ రెడ్డి, ఏసీ నాగరాజు, టీఎంసీ గంగులయ్య, మెప్మా సీఓలు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఫర్టిలైజర్స్ షాపుల రికార్డుల్లో తేడాలు ఉన్న రూ. 13,46,354 విలువ చేసే 52.2 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డితో కలిసి బత్తలపల్లిలోని హనుమాన్ ట్రేడర్స్, మోహన్ ట్రేడర్స్, మంజునాథ ట్రేడర్స్‌తో పాటు 9 దుకాణాల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డుల్లో తేడాలు ఉన్న కారణంగా హనుమాన్ ట్రేడర్స్‌లో రూ. 5,13,954 విలువ చేసే 24.88 మెట్రిక్ టన్నులు, మోహన్ ట్రేడర్స్‌లో రూ. 7.28లక్షల విలువ చేసే 23 మెట్రిక్ టన్నులు, మంజునాథ ట్రేడర్స్‌లో రూ. 1,04,400లు విలువ చేసే 2.9 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డిసిటిఒ సురేష్‌కుమార్, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం

ప్రజాశక్తి-బత్తలపల్లి

రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమని ఎంపిపి బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. ఆమె ఆదివారం మండలంలోని గుమ్మళ్లకుంట గ్రామంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల తొలగింపులో ప్రభుత్వ తీసుకున్న చర్యలను ఖండించారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్లను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో సదరంలో 80 శాతం అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యులు నేడు అదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతం మాత్రమే వైకల్యం ఉన్నట్లు ఇవ్వడం ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. అర్హులైన వికలాంగులకు యథావిధిగా పింఛన్లు కొనసాగించాలని, లేనిచో వికలాంగుల తరపున వైసిపి పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978-80 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఆదివారం అదే కళాశాలలో కలిశారు. వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన వారందరూ సుమారు 45 ఏళ్ల తర్వాత కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై వారిని ఉద్దేశించి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ఆ నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గుండుమల తిప్పేస్వామి కాసేపు వారితో సరదాగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి విందు భోజనం చేశారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు ప్రభాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు జయశంకర్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో రచ్చబండ

మడకశిర : నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్ఎల్.ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గంగులవాయిపాలెం పంచాయతీలోని కొల్హాపూరి ఆలయంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసేగౌడ్, చాంద్ బాషా, కృష్ణారెడ్డి, తిప్పేస్వామి, నరేష్‌రెడ్డి, ముద్దరెడ్డి లక్ష్మీనారాయణ, గిరీష్, హనుమంతు, తిప్పేష్, రామేగౌడ, శివరాజ్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైబి హళ్లి పంచాయతీలో వైసిపి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైసి.బాలారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, శేషాద్రి, బాబేష్, లక్ష్మీనారాయణగౌడ్, ధనలక్ష్మి, మంజునాథ్, దొడ్డయ్య, నాగభూషణ్‌రెడ్డి, మధు, సత్యనారాయణరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణగౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న తమిళనాడు కళాకారిణిలు

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

పుట్టపర్తి క్రైమ్ : పట్టణ శివారులోని శిల్పారామంలో వారాంతపు సెలవుల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయని శిల్పారామం ఏవో ఖాదర్‌వలి తెలిపారు. శిల్పారామంలో ఆదివారం తమిళనాడుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయన్నారు. గురువు హేమామాలిని రాజమోహన్ ఆధ్వర్యంలో నాట్య కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో పాటు పలు పాటలకు నృత్యాలు చేశారన్నారు. శిల్పారామం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం అన్నారు. పండగ రోజుల్లోనే కాకుండా వారాంతపు సెలవుల్లో కూడా ప్రజలకు ఆటవిడుపుగా వివిధ కళాకారుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి శిల్పారామం వేదికగా మారడం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎన్నిక

అగళి : ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలో అగళి, తరిమెల జట్లు తలపడగా అగళి జట్టు విన్నర్స్‌గా నిలిచింది. దీంతో అగళి మండల వాలీబాల్ జట్టు రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జరిగే పోటీలకు అర్హత సాధించిందని వాలీబాల్ టీం నాయకుడు యశ్వంత్ తెలిపారు. ఈ జట్టులో మారుతి, యశ్వంత్, లోహిత్, నవీన్‌కుమార్, మంజు, నరసింహ, కరియన్న సభ్యులు. అగళి జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'సజ్జల'ను కలిసిన కోటి సురేష్

బత్తలపల్లి : వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఆదివారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ తాడేపల్లిలోని ఆ పార్టీ అధినేత జగన్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో పార్టీ స్థితిగతులు, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై చర్చించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో పార్టీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని సజ్జల ఆదేశించినట్లు కోటి సురేష్ తెలిపారు.

ఘనంగా సైన్స్ మార్చ్

ప్రజాశక్తి-హిందూపురం

ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ ఆర్గనైజేషన్ తరపున శేఖర్ అకాడమీ సహకారంతో ఆదివారం పట్టణంలో సైన్స్ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్ శేఖర్ అకాడమీ నుంచి వాల్మీకి సర్కిల్ మీదుగా చిన్న మార్కెట్ వరకు కొనసాగింది. చిన్న మార్కెట్ సర్కిల్ లో మానవహారాన్ని ఏర్పాటు చేసి ఈ సైన్స్ మార్చ్ కు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌ఛార్జి మల్లిక్ దత్ కుమార్, శ్రీ శేఖర్ అకాడమీ కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, సభ్యులు పూజిత, జయచంద్ర, బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ సభ్యులు సురేంద్రనాథ్ రెడ్డి, సలీం భాష, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, లావణ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న బ్రహ్మకుమారి నిలయంలో విశ్వ బంధుత్వ రాజయోగిని ప్రకాష్ మనీ దాది గారి 15వ స్మృతి దినోత్సవం సందర్భంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మేన్ డి ఈ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు హరీష్ కుమార్ తో పాటు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని కోట ప్రాంతంలో భాస్కర పంతులు నివాసం ఉంటున్న వీధికి భాస్కర పంతులు వీధిగా పేరు గాంచింది. వీధికి భాస్కర పంతులు వీధిగా నామకరణం చేసి, ఆదివారం సూచిక బోర్డును ఏర్పాటు చేసి, దానిని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు ప్రజలను చైతన్య పరుస్తూ, ఆర్య వైశ్యులకు తర తరాలుగా కులగురువులుగా మార్గదర్శనం చేసిన భాస్కర పంతులు పట్ల గౌరవంతో వీధికి భాస్కర పంతులు వీధిగా గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర, పట్టణ మాజీ మునిసిపల్ చైర్మన్ విద్యాసాగర్, మాజీ కౌన్సిలర్ మురళి, పట్టణ తెలుగు దేశం అధ్యక్షులు వెంకటేష్, మోదా శివ, చైతన్య కుమార్, కొల్లాపురమ్మ దేవస్థానం కమిటీ ప్రసాద్, భాస్కరపంతుల కుటుంబం తరపున కుటుంబ పెద్దలు జయలక్ష్మీ, బాలసుబ్రమణ్యం, అరుణాచలం, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అంబికాకు ప్రజాసంఘాల కృతజ్ఞతలు



ఎంపీ అంబికాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

యశ్వంత్ పురం నుండి కాచిగూడ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హిందూపురం రైల్వే స్టేషన్ లో ఆగడానికి కృషి చేసిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణకు హిందూపురం ప్రజా సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం అనంతపురంలో ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, సామాజిక కార్యకర్త ఉమర్ ఫరూక్ ఖాన్ మాట్లాడుతు వందే భారత్ రైలు హిందూపురం రైల్వే స్టేషన్ లో ఆగడం వల్ల ఈ ప్రాంత ప్రయాణికులకు హైదరాబాద్ కు వెళ్లేందుకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. అదే విధంగా ధర్మవరం నుండి విజయవాడ వెళ్లే రైలును హిందూపురం నుండి వెళ్లే విధంగా చేయాలని, కొండవీడు రైలును ప్రతిరోజు వెళ్లే విధంగా చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామ్మూర్తి, ఆదెప్ప, టైలర్ గంగాధర్, లంబాడి సంఘం నాయకుడు కృష్ణా నాయక్, బహుజన చైతన్య వేదిక నాయకుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

ప్రజాశక్తి-హిందూపురం

వినాయక పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహం ఏర్పాట్లుకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎస్.హెచ్.ఓ నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డిఎస్‌పి మహేష్ తెలిపారు. ఆదివారం పట్టణ సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీంలతో కలిసి డిఎస్‌పి మహేష్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించే కమిటీ తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్ లైన్ విధానంలో అనుమతులు పొందాలన్నారు.